# ఖర్జూరపు మట్టలు

“ఖర్జూరపు మట్టలు పట్టుకొని ఆయనను ఎదుర్కొనబోయి జయము, ప్రభువు పేరట వచ్చుచున్న ఇశ్రాయేలు రాజు స్తుతింపబడునుగాక అని కేకలువేసిరి”. యోహాను 12:13; ఎందుకు ప్రభువును ఖర్జూర మట్టలతో ఊరేగించారు?

పరిశుద్ధ గ్రంధంలో ఈ చెట్టును గురించి విస్తారంగా వ్రాయబడినది. దాదాపు 60 వాక్య భాగాలు దీని గురించి ఉన్నాయి. ఖర్జూర వృక్షంనకు అనేక ఇతర పేర్లుగలవు. తమాలవృక్షం, తాళ వృక్షం, సరళ వృక్షం, ఈత వృక్షం, కొబ్బరి చెట్టు, పాంఆయిల్ చెట్టు, వీటన్నిటికి ఇంగ్లీష్ బైబిల్లో పామ్ ట్రీ అని వ్రాయబడి యున్నది. ఖర్జూర వృక్షం ప్రభువుకు మరియు విశ్వాసులైనవారికి సాదృశ్యమైనది.

## 1. ఖర్జూరమట్టలు జయమునకు పండుగ సంతోషమునకు సూచకము

“ ఖర్జూరపు మట్టలు పట్టుకొని ఆయనను ఎదుర్కొనబోయి జయము, ప్రభువు పేరట వచ్చుచున్న ఇశ్రాయేలు రాజు స్తుతింపబడును గాక అని కేకలువేసిరి”. యోహాను 12:13 ; “ మొదటి దిన మున మీరు దబ్బపండ్లను ఈతమట్టలను గొంజి చెట్ల కొమ్మలను కాలువల యొద్దనుండు నిరవంజి చెట్లను పట్టుకొని యేడుదినములు మీ దేవుడైన యెహోవా సన్నిధిని ఉత్సహించుచుండవలెను.” లేవి 23:40; ప్రభువు విజయుడు “నేను లోకమును జయించి యున్నాననెను”. యోహ 16:33; విశ్వాసులు విజయులు “ఆయనతోకూడ మిమ్మును జీవింపచేసెను; ఆయన ప్రధానులను అధికారులను నిరాయుధులనుగా చేసి, సిలువచేత జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహాటముగా వేడుకకు కనుపరచెను.” కొల 2:15;

## 2. ఖర్జూర వృక్షం సౌందర్యం గలది

యెరికో పట్టణము ఖర్జూర చెట్లతో నిండినది. (City of palms) , “మోషే మామయైన కేయిను కుమారులు యూదా వంశస్థులతో కూడ ఖర్జూరచెట్ల పట్టణములోనుండి అరాదు దక్షిణ దిక్కులోని యూదా అరణ్యమునకు వెళ్లి అక్కడ చేరి ఆ జనముతో నివసించిరి”. న్యాయా 1:16 ; “అంతట ఆ పట్టణపువారు ఈ పట్టణమున్న చోటు రమ్యమైనదని మా యేలినవాడవైన నీకు కనబడుచున్నది”. 2 రాజు 2:19; “సోయరు వరకు ఈత చెట్లుగల యెరికో లోయ చుట్టు మైదానమును అతనికి చూపించెను”. ద్వితీ 34:3; హెబ్రీ భాషలో ఖర్జూర చెట్టును తామారు అందురు. అనగా సౌందర్యము అని అర్ధం. యేసు సౌందర్యవంతుడు. “నా ప్రియుడు ధవళవర్ణుడు ర త్న వర్ణుడు పదివేలమంది పురుషులలో అతని గుర్తింపవచ్చును”. పరమ 5:10; పరమగీతం 5: 9-16 భాగంలో ప్రభువు సౌందర్యము వర్ణించబడినది, దేవుని బిడ్డలు కూడా ఆత్మ సౌందర్యము గలవారు. “నా ప్రియురాలా, నీవు సుందరివి నీవు సుందరివి నీ కన్నులు గువ్వ కండ్లు”. పరమ 1:15; దేవుని బిడ్డలకు కావలసినది అంతఃసౌందర్యం.“ అందము మోసకరము, సౌందర్యము వ్యర్థము యెహోవాయందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడబడును”. సామె 31:30.

## 3. ఖర్జూరవృక్షం తిన్నగా పెరుగునది

“నీవు తాళ వృక్షమంత తిన్నని దానవు”. పరమ 7:7; అనగా వంకరలేనిది. పరిశుద్ధ గ్రంధంలో వంకర అనునది పాపమునకు సాదృశ్యంగా ఉన్నది. “తమ వంకరత్రోవలకు తొలగిపోవువారిని పాపము చేయువారితో కూడ యెహోవా కొనిపోవును”. కీర్త 125:5; “వారు నడుచుకొను త్రోవలు వంకరవి వారు కుటిలవర్తనులు”. సామె 2:15; శాంతవర్తనమును వారెరుగరు వారి నడవడులలో న్యాయము కనబడదు వారు తమకొరకు వంకరత్రోవలు కల్పించుకొను చున్నారు వాటిలో నడచువాడెవడును శాంతి నొందడు. క్రీస్తు మార్గం వంకరలేనిది.

## 4. ఖర్జూర చెట్టు నీతి చూపించుచున్నది

యూదా కోడలు తామారు నీతిమంతురాలు. తామారు అనగా ఖర్జూర చెట్టు. “ ఆమె నా కంటె నీతిమంతురాలు”.

ఆది 38:26 ; ప్రభువు నీతిపరుడు గనుక నీతిని చూపించు ఖర్జూర మట్టలతో ఊరేగించారు. “నీ రాజు నీతిపరుడును రక్షణగలవాడును, దీనుడునై, గాడిదను గాడిద పిల్లను ఎక్కి నీయొద్దకు వచ్చుచున్నాడు”. జెక 9:9; విశ్వాసులు కూడా నీతిమంతులుగా ఉండాలి, “నీతి అను మస్తకివృక్షములనియు యెహోవా నాటిన చెట్లనియు వారికి పేరు పెట్ట బడును”. యెషయ 61:3

## 5. ఖర్జూర చెట్టు దేవుని చేత ఆశీర్వదించబడినది

“నీతిమంతులు ఖర్జూర వృక్షమువలె మొవ్వు వేయుదురు లెబానోనుమీది దేవదారు వృక్షమువలె వారు ఎదుగుదురు. యెహోవా మందిరములో నాటబడినవారై వారు మన దేవుని ఆవరణములలో వర్ధిల్లుదురు”.

కీర్త 92:12,13; దేవాలయములో ఖర్జూర చెట్లు చెక్కబడెను. “ప్రతి స్తంభముమీదను ఖర్జూరపు చెట్లు రూపింపబడి యుండెను.” యేహెజ్కేలు 40:16; సొలోమోను దేవాలయములో ఖర్జూర వృక్షములను చెక్కించెను. “మరియు మందిరపు గోడలన్నిటిమీదను లోపల నేమి వెలుపల నేమి కెరూబులను తమాల వృక్షములను వికసించిన పుష్పములను చెక్కిం చెను”. 1 రాజు 6:29

## 6. ఖర్జూర చెట్టు దీర్ఘకాలం జీవించును

ఇది దేవుని కాపుదలను తెలియ జేయుచున్నది. “నీతిమంతులు ఖర్జూరవృక్షము వలె మొవ్వు వేయుదురు లెబానోనుమీది దేవదారు వృక్షమువలె వారు ఎదుగుదురు”. కీర్త 92:12; “వారు ముసలితనమందు ఇంక చిగురు పెట్టుచుందురు సారము కలిగి పచ్చగా నుందురు”. కీర్త 92:15; దేవుని బిడ్డలు దీర్ఘకాలం బ్రతుకగలరు. “ముదిమి వచ్చువరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే, తల వెండ్రుకలు నెరయువరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే, నేనే చేసియున్నాను చంకపెట్టుకొనువాడను నేనే నిన్ను ఎత్తికొనుచు రక్షించువాడను నేనే. యెషయ 46:4 ;

" మోషే చనిపోయినప్పుడు నూట ఇరువది సంవత్సరముల యీడుగలవాడు, అతనికి దృష్టి మాంద్యములేదు, అతని సత్తువు తగ్గలేదు". ద్వితీ 34:7;

ఖర్జూర చెట్టు యొక్క కాండం బహు గట్టిగా ఉండును అనేక శ్రమలకు తట్టు కోనును.ఇది ఆ చెట్టు యొక్క స్థిరత్వము చూపుచున్నది. అందునుబట్టి ఇది ఎటువంటి తీవ్ర పరిస్థితులనైన మరియు తుఫానులనైన తట్టుకొనగలదు. 'నీతిమంతుడు నిత్యము నిలుచు కట్టడమువలె ఉన్నాడు". సామె 10:25

## 7. ఖర్జూర మట్టలు ప్రభువు పరిచర్యలో వాడబడినవి

"అనేకులు తమ బట్టలను దారి పొడుగునను పరచిరి, కొందరు తాము పొలములలో నరికిన కొమ్మలను పరచిరి". మార్కు 11:8; ప్రభువునకు ఎండవేడి తగులకుండా ఈ కొమ్మలు వాడబడినవి. "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్త మైనది". రోమా 12:1 ..

## 8. ఖర్జూర వృక్షం మట్టలు పరలోకంలో కూడా కనబడుచున్నవి.

" అటుతరువాత నేను చూడగా, ఇదిగో, ప్రతి జనములో నుండియు ప్రతి వంశములో నుండియు ప్రజలలో నుండియు, ఆయా బాషలు మాటలాడువారిలో నుండియు వచ్చి, యెవడును లెక్కింపజాలని యొక గొప్ప సమూహం కనబడెను. వారు తెల్లని వస్త్రములు ధరించుకొనిన వారై ఖర్జూర మట్టలు చేత బట్టుకొని సింహాసనం ఎదుటను గొర్రెపిల్ల యెదుటను నిలువబడి సింహాసనా సీనుడైన మా దేవునికిని గొఱ్ఱపిల్లకును మా రక్షణకై స్తోత్రమని మహాశబ్దముతో ఎలుగెత్తి చెప్పిరి". ప్రక 7:9;

- ఖర్జూర వృక్షం ఎంత ఉన్నతంగా పెరుగుతుందో అంతా ఉన్నతమైన నీతిని మనం కలిగి ఉండాలని దేవుడు కోరుతున్నాడు.
- ఖర్జూర వృక్షం వలె తిన్ననైన అనగా పరిశుద్ధమైన జీవితం కలిగి యదార్ధంగా ఉందాం.
- దేవుని మందిరంలో ఖర్జూర వృక్షం చెక్కబడినట్లు మనందరం దేవుని ఎల్లప్పుడు మహిమ పరిచేవారంగా ఉండాలి.
- మందిరపు తలుపులపై ఖర్జూర వృక్షం చెక్కబడినట్లు, ప్రభువుకు మన హృదయపు తలుపులు తెరచి క్రీస్తు ప్రభువు మరియు ఆయన వాక్యం ఎల్లప్పుడు హృదయంలో సమృద్ధిగా జీవించునట్లు హృదయపు ద్వారాలు ప్రభువు కొరకు తెరచి ఉంచాలి.
- ఖర్జూర వృక్షం అమితంగా ఫలిచినట్లు, మనం కూడా ఫలభరితమైన జీవితం జీవించాలి.

**దేవుడు ఖర్జూర వృక్షములవలే మిమ్మును బహుగా వర్ధిల్లజేసి దీవించునుగాక!!**